

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శనివారం, 31 మే, 2025 | 8 పేజీలు

ప్రతి ఒక్కరి సమస్యకు నిబ్బరమైన పరిష్కారం చూపించాలి

ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : సామాన్య ప్రజల సమస్యలకు నిబ్బరమైన పరిష్కారం చూపించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రోజు చిన్నమండెం మండలం బోరెడ్డిగారి పల్లెలోని తన నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం జరిగింది.

యోగాంధ్ర-2025 కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి...!!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఈనెల 21 నుండి జూన్ 21 వరకు 'యోగాంధ్ర- 2025' మాసోత్సవాల్లో నిర్వహించే అన్ని కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. నెల రోజుల పాటు "యోగాంధ్ర- 2025"పై నిర్వహించే వివిధ కార్యక్రమాలు, పీఎం-సూర్యఘర్ పథకం, ఎన్టిఆర్ వైద్యసేవలు, స్వచ్ఛఆంధ్ర, హరితాంధ్ర, హౌసింగ్ తదితర అంశాలపై.. శుక్రవారం సాయంత్రం అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ అదితిసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ.. 11వ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో జరగబోయే కార్యక్రమంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని దీనికి రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది హాజరయ్యే లక్ష్యంతో అధికారులు

2

కడప మహానాడు సూపర్ సక్సెస్ : జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : చరిత్రలో నిలిచిపోయేలా కడప గడపలో నిర్వహించిన మహానాడు సూపర్ సక్సెస్ అయ్యిందని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత హర్షం వ్యక్తం చేశారు. మహానాడు విజయవంతానికి కృషి చేసిన టీడీపీ ఉమ్మడి కడప జిల్లా నాయకులకు, కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కడప మహానాడు విజయంతం కావడంతో శుక్రవారం నగరంలోని హోటల్ హరితలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా, సమన్వయంగా మహానాడును దిగ్విజయంగా నిర్వహించారని తెలిపారు. మహానాడు నిర్వహణకు నియమించిన 13 కమిటీ సభ్యులు కూడా ఈ విజయంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలకున్న అపారమైన నమ్మకం మరోసారి రుజువైందన్నారు. కడప మహానాడు కనీవిని ఎరుగని రీతిలో విజయవంతమైందని ఆనందం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో కడప మహానాడు స్ఫూరితో మహానాడులను విజయవంతం చేస్తామన్నారు. మహానాడు వేదికలు పలు తీర్మానాలు చేశామన్నారు. రోడ్డు, భవనాల శాఖ మంత్రి మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా కడపలో మహానాడు నిర్వహణకు అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబుకు, మంత్ర లోకేశ్ కు ధన్యవాదాలు తెలిపారు. కడప మహానాడుకు రాయలసీమలోని అన్ని నియోజక వర్గాల నుంచి ప్రజలు, టీడీపీ కార్యకర్తలు భారీగా

2

రైతులను ఖరీఫ్ సాగుకు సమాయత్తం చేయాలి

రైతులకు పప్పు ధాన్యాల సాగుపై క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలి

అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లె : ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని లక్కిరెడ్డిపల్లె, అనంతపురం రైతు సేవా కేంద్రాలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులు, సిబ్బందితో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కడపకు చెందిన కెవికె శాస్త్రవేత్తలు ముఖ్య అతిథులుగా హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ మాట్లాడుతూ వేరుశనగ సాగు చేసుకునే రైతులు ఈ ఏడాది కదిరి, లేపాక్షి, విశిష్ట రకం వంటి విత్తనాలు సాగు చేసుకుంటే అనువుగా ఉండడంతోపాటు మంచి దిగుబడులు సాధించుకోవచ్చునని అన్నారు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో యాంత్రికరణ లో భాగంగా డ్రోన్లు ను అందజేస్తుందని ఇవి రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. రైతులు ప్రతి ఏడాది వరి, వేరుశనగ వంటి పంటలే కాకుండా పప్పు ధాన్యాల పంటలైన కంది, ఉలవ, అలసంద, పెసలు, మినుములు వంటి పంటలపై మక్కువ చూపాలన్నారు. అనంతరం కేంద్ర నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త బసవరాజ్ మాట్లాడుతూ ఆముదంలో ఐసి హెచ్ బి5, 6 అనే రకాలు 90 రోజుల కే కాపుకు వస్తాయని , ఒక హెక్టారుకు 11 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి ఇస్తూ 46 నుండి 48 నూనె శాతం కలిగి ఉంటుందన్నారు.థీల్ టెక్, తిల్ బి1 నువ్వుల రకం తెల్ల నువ్వులు మన ప్రాంతంలో సాగుకు అనువుగా ఉంటాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది రైతులకు సూచించాలన్నారు. అనంతరం ఉద్యాన శాఖ అధికారిని నాగమణి మాట్లాడుతూ పండ్ల తోటలో పై ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవ కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ముద్ర మామిడి చెట్లలో కొమ్మల కత్తిరింపు ప్రక్రియ తూర్పు పడమర మామిడి చెట్టు మధ్యలో కొమ్మలను కత్తిరిస్తే సూర్యరశమే వెలుతురు వచ్చి రోగాలు రాకుండా పంట దిగుబడి బాగా వస్తుందని సూచించారు. అనంతరం డిపిఎం వెంకట మోహన్ మాట్లాడుతూ పి ఎమ్ డి ఎస్ కిట్లను రైతులందరూ సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది రైతులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ జయ రాణి, కెవికె శాస్త్రవేత్త శిల్పకళ, ఏఈఓలు కెరోలిన్, అంజనమ్మ, విహెచ్ఎలు సాయి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ కమీషనర్.. మాకొద్దు బాబోయ్..

పని ఒత్తిడితో స్పృహ తప్పిన శానిటేషన్ కార్యదర్శి

కమిషనర్ వేధింపులే కారణమని కార్మికుల ఆరోపణ -కనీసం పరామర్శకు కూడా తొంగి చూడని కమిషనర్

విశాలాంధ్ర-రాజంపేట : శక్తికి మించి మితిమీరిన పని ఒత్తిడి కారణంగా పురపాలక కార్యాలయం వద్దే 10 వ వార్డు కొలిమి వీధి శానిటేషన్ కార్యదర్శి స్పృహ తప్పి పడిపోయిన ఘటన శుక్రవారం రాజంపేట పట్టణంలో చర్చనీయాంశమైంది. ఉదయం ఐదు గంటలకు మాస్టర్ వేయడానికి పురపాలక కార్యాలయానికి వచ్చిన శానిటేషన్ కార్యదర్శి హర్షవర్ధన్ స్పృహ తప్పి ట్రాక్టర్ పైనుంచి కింద పడిపోవడంతో మున్సిపల్ కార్మికులు, సచివాలయ ఉద్యోగులు హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న హర్షవర్ధన్ ను మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, కౌన్సిలర్లు, మేనేజర్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితుడు హర్షవర్ధన్ సతీమణి సంధ్య చంటి బిడ్డతో ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు. ఈ సందర్భంగా ఆమె మున్సిపల్ కార్మికులు, సచివాలయ కార్యదర్శులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ మునిసిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు వేధింపుల కారణంగానే తన భర్తకు ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కమిషనర్ ప్రతిరోజు తన భర్తను ఏదో ఒక వంకతో దుర్భాషలాడుతూ వేధింపులకు గురి చేసేవాడని, కమిషనర్ వేధింపులు భరించలేకున్నానని తన భర్త పలుమార్లు తనతో చెప్పినట్లు ఆమె తెలిపారు. మునిసిపల్ కార్మికులు, సచివాలయ కార్యదర్శులు మాట్లాడుతూ 11 మంది సచివాలయ కార్యదర్శి ఉండగా కమిషనర్ వేధింపులు భరించలేక 6 మంది సెలవు పై వెళ్లారని, మిగిలిన 5 మంది కార్యదర్శులకు పని భారం ఎక్కువైందని తెలిపారు. 150 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం ఉండగా., కేవలం 70 మందితోనే పారిశుద్ధ్య నిర్వహణ చేయిస్తుండడంతో అటు కార్మికులకు, ఇటు శానిటేషన్ కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారిందని వాపోయారు. కమీషనర్ ప్రతి ఒక్కరి పైనా పలు రకాలుగా వేధింపులకు పాల్పడుతున్నాడని, ఈ కమిషనర్ వద్ద తాము విధులు నిర్వహించలేమని, ఈ కమిషనర్ మాకొద్దు బాబోయ్ అంటూ ముక్తకంఠంతో తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మేనేజర్, పురపాలక సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో పాటు రాజంపేట పుర ప్రజలు ఆసుపత్రి వద్దకు చేరుకొని హర్షవర్ధన్ కుటుంబాన్ని పరామర్శించగా కమిషనర్ శ్రీనివాసులు కనీసం తొంగి చూడకపోవడంతో కార్మికులు, ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం సిఐటియు ఆధ్వర్యంలో బాధితుడు సతీమణి సంధ్య, మున్సిపల్ కార్మికులు, సచివాలయ కార్యదర్శులుతో కలిసి ఆసుపత్రి వద్ద కమీషనర్ తీరుకు నిరసన తెలిపారు.

కడప మహానాడు సూపర్ సక్సెస్

(మొదటి పేజి తరువాయి) తరలొచ్చారన్నారు. ఈ విజయంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో పదికి పది శాసనసభ స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామ గోపాల్ రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కడప మహానాడు విజయంతం కావడంతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం వచ్చిందని తెలిపారు. మహానాడు వేదికగా రాయలసీమ ఉజ్వల భవిష్యత్తుకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారన్నారు. రాయలసీమను సస్య శ్యామల చేయడమే కాకుండా సుసంపన్నం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు కోసం ప్రస్తుతం రూ.3,873 కోట్లు ఖర్చు పెడుతున్నామన్నారు. మరో పది రోజుల్లో స్టీల్ ప్లాంట్ పనులు మొదలు పెడతామన్నారు. రూ.వెయ్యి కోట్లతో గాలేరు-నగరి నుంచి కడపకు నీరు తీసుకొస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ ప్రజలతో పాటు ప్రకృతి కూడా టీడీపీ మహానాడు విజయవంతానికి సహకరించిందన్నారు. రాయలసీమ బిడ్డగా సీఎం చంద్రబాబునాయుడు ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మాధవిరెడ్డి, భూపేష్ రెడ్డి, సీహెచ్ జగన్ మోహన్ రాజు పాల్గొన్నారు.

యోగాంధ్ర-2025 కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి...!!

(మొదటి పేజి తరువాయి) చాలన్నారు. నెల రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ఒక్కొక్క రోజు ఒక్కో జిల్లాలో రాష్ట్రస్థాయి కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేకంగా యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విజన్-2047 లో పేర్కొన్న విధంగా ఆరోగ్య ఆంధ్రను నిర్మించడానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాపై గ్రామ, మండల, జిల్లా స్థాయి పోటీలను నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... జిల్లాలోని ప్రధాన మునిసిపాలిటీలలో, ప్రతి గ్రామంలో యోగ రోడ్డులను ప్రజలందరికీ తెలియజేసి పతిరోజు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు ప్రజలందరూ యోగా చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఆదివారం ఉదయం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని సంస్థాగత, పబ్లిక్ ప్రదేశాల్లో జిల్లాలో యోగా క్యాంపెయిన్ లను నిర్వహించాలన్నారు. ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ యోగ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. జూన్ 10వ తేదీ వరకు ఆశక్తి కలిగిన ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.. సచివాలయ సిబ్బంది మీ ఇంటివద్దకే వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. కాగా ఈ రోజు (జూన్ 30వ తేదీ) వరకు మొత్తం 3,06,034 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సంఖ్య ఇంకనూ పెరగాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి పూర్తిస్తాయిలోకి తీసుకెళ్లాలని, అందుకు సంబంధించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛఆంధ్ర, హరితాంధ్ర కార్యక్రమంలో భాగంగా.. జూన్ 5వ తేదీన పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అందుకోసం జిల్లా అటవీ శాఖ, అన్నీ మున్సిపాలిటీల కమిషనర్లు, ఎంపిడివోలు, డ్వామా అధికారులు, ఎన్జీవోలు, అనుబంధ శాఖల అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, సీపీవో హాజరతయ్య, డిపివో రాజ్యలక్ష్మి, డిఆర్డీఏ, డ్వామా, మెప్మా పీడీలు రాజ్యాలక్ష్మి, అదిశేషారెడ్డి, కిరణ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం సుబ్బరాయుడును పరామర్శించిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన బీసీ నేత పాణ్యం సుబ్బరాయుడును టీఎన్టీయూసి జిల్లా అధ్యక్షులు చింతకుంట కుతుబుద్దీన్, బీసీ నేత పోసా భాస్కర్, 30 వ వార్డు టిడిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డిలు శుక్రవారం నాడు పరామర్శించారు. పాణ్యం సుబ్బరాయుడు గత కొద్ది రోజుల నుంచి పక్షవాతం జబ్బుతో బాధపడుతున్నారు కావున టీడీపీ నాయకులు ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని ధైర్యం నింపారు. తెలుగుదేశం పార్టీ మాజీ కౌన్సిలర్ గా, తెలుగుదేశం పార్టీ నాయకునిగా ఆయన చాలా కాలం పనిచేశారు. అదేవిధంగా ఆయన సతీమణి పాణ్యం సావిత్రమ్మ 1995 సంవత్సరంలో ప్రొద్దుటూరు మండల జడ్పిటిసి సభ్యులుగా, 2004 నుంచి 2009 వరకు ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ గా తెలుగుదేశం పార్టీ నుండి ప్రాతినిధ్యం వహించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు

విశాలాంధ్ర- సుండుపల్లె: రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంటును శుక్రవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపు ఓటములు సాధారణమని ప్రతి క్రీడాకారుడు క్రీడలను స్పోర్టివ్ గా తీసుకొని ఎటువంటి గొడవలు వెళ్లకుండా టోర్నమెంట్ను చర్పించాలన్నారు. అనంతరం మహేష్ నాయుడు జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు క్రీడాకారులు ఘనంగా కేక్ కట్ చేసి తినిపించారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తానా ప్రెసిడెంట్ వేమన సతీష్, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త పోలి సుబ్బారెడ్డి, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి, యూనియన్ భాష తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, సూపర్ సిక్స్ పథకాల అమలుకై

జూన్ 2న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన

కడప నగర సమగ్రాబివృద్ధికి పోరుబాట -సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర- కడప రూరల్ : అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలము, ఇంటి నిర్మాణానికి 5 లక్షలు, టిడ్కో ఇళ్ళు పంపిణీ చేయాలని, సూపర్ సిక్స్ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ చేపట్టిన తాహాసిల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ నగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన గాలి చంద్ర మాట్లాడుతూ కడప నగర సమగ్ర అభివృద్ధికి, అందుకు తగ్గ నిధులు విడుదల కై పాలక ప్రభుత్వాలపై ఒత్తిడికి తగ్గ ఉద్యమ కార్యాచరణ చేపట్టాలన్నారు. పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇండ్లు ఇస్తాం, ఇంటి స్థలం ఇస్తాం, రేషన్ కార్డుతో పాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, 24 గంటలు త్రాగునీరు అందిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ప్రజలు ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెడుతున్నారని వారు ఆరోపించారు. దశాబ్దాల తరబడి పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం అధికారులు అధికార పార్టీ నేతల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న ఫలితం దక్కడం లేదన్నారు. గతంలో పోరాడి సాధించుకున్న భూ సంస్కరణ చట్టాన్ని అధికార పార్టీ నేతలు చుట్టంగా మార్చుకొని వందల ఎకరాల భూములు ఆక్రమించుకొని చుట్టూ సోలార్ ఫెన్సింగ్, మధ్యలో విలాసవంతమైన ఫామ్ హౌస్ సంస్కృతిని పెంచి పోషిస్తూ వారి కొమ్ము కాస్తున్న రెవెన్యూ పోలీస్ యంత్రాంగం విధి లేక పేదవాడు జానెడు జాగాలో గుడిసె వేసుకుంటే ఆగ మేఘాల మీద గుడిసె పీకి పెట్టి కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ఉచిత బస్సు, తల్లి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్, ఇండ్లు, ఇంటి స్థలం, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ పథకాల అమలుకై జూన్ 2న తాహాసిల్దార్ కార్యాలయాల వద్ద తలపెట్టిన సిపిఐ రాష్ట్రవ్యాప్త ఆందోళన జయప్రదం చేయాలన్నారు. సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు చంద్ర శేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగర కార్యదర్శి యన్. వెంకట శివ,సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, సావంత్ సుధాకర్,బ్రహ్మం,మునెయ్య, శంకర్ నాయక్, భాగ్యలక్ష్మి, లింగన్న, ఆర్.బాబు,యేసు రత్నం,సుబ్బరాయుడు, భరత్, పకీరప్ప, నరసమ్మ, కృష్ణ, శివతేజ తదితరులు పాల్గొన్నారు.

కోవర్ట్ రాజకీయాలకు చెక్ పెడతాం..

సమిష్టి కృషితో రాజంపేట అభివృద్ధి

వర్గాలు లేవు.. బేధాలు లేవు..అందరిదీ ఒకటే పార్టీ -చమర్తి నాయకత్వం సూపర్ సక్సెస్

మహానాడు విజయం కార్యకర్తలదే -పార్లమెంట్ అధ్యక్షులు జగన్మోహన్ రాజు

విశాలాంధ్ర -రాజంపేట: టిడిపి జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కార్యకర్త అధినేత అనే శాసనాలను తూచా తప్పకుండా పాటిస్తూ.. రాజంపేట నియోజకవర్గంలో ఉన్నటువంటి కోవట రాజకీయాలకు చెక్ పెడతాం అని రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. శుక్రవారం పార్లమెంట్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట అభివృద్దే లక్ష్యంగా సమిష్టి కృషితో పని చేస్తామన్నారు. మినీ మహానాడు వేదికలో అందరి అభిప్రాయాల మేరకు వర్గాలు.. బేధాలు లేకుండా అందరిదీ ఒకే పార్టీ.. అదే తెలుగుదేశం పార్టీ అన్నట్లుగా ఏకతాటిపై వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి త్వరలోనే ఒక ప్రత్యేక టీం ను ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామన్నారు. కార్యకర్తల సమిష్టి కృషితోనే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు కడప జిల్లాలో జరిగిన మహానాడు కార్యక్రమానికి రాజంపేట అసెంబ్లీ కేంద్రం నుండి భారీ సంఖ్యలో బహిరంగ సభకు తరలి వెళ్లడం జరిగింది అన్నారు. మహానాడు విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మహానాడు వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజంపేట ప్రాంత అభివృద్ధికి అన్నమయ్య ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇవ్వడం పట్ల మినీ మహానాడులో చేసిన తీర్మానం ఫలించింది అన్నారు. అంతేకాకుండా రానున్న నాలుగేళ్లలో రాజంపేట నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు పోదామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మండల అధ్యక్షులు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఎస్వీ రమణ, పార్లమెంట్ అధికార ప్రతినిధి జగదాంబ పాండురాజు టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చమర్తి నాయకత్వం సూపర్ సక్సెస్..

మొన్నటి వరకు రాజంపేట నియోజకవర్గంలో వర్గ భేదాలతో సతమతం అవుతున్న కార్యకర్తలకు పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో మినీ మహానాడు జరిగిన వేదికపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం పని చేయాలని, ప్రతి కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇవ్వడంతో పసుపు శ్రేణులు ఒక తాటిపైకి వచ్చి చమర్తి నాయకత్వాన్ని బలపరిచారు. ఇదే తరుణంలో కడపలో జరిగిన మహానాడుకు ఊహించని రీతి కంటే వంద శాతం సూపర్ సక్సెస్ అయింది. దీంతో కార్యకర్తలందరూ ఏకతాటిపైకి వచ్చి చమర్తి నాయకత్వాన్ని బేష్ అంటూ అభినందిస్తున్నారు.

పార్లమెంట్ అధ్యక్షుడు కి ఘన సన్మానం..

రాయలసీమ ప్రాంతమైన కడప గడ్డపై జరిగిన మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు క్లస్టర్ ఇంచార్జిలు, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు జగన్మోహన్ రాజును గజమాలతో ఘనంగా సన్మానించారు. పార్టీ అధ్యక్ష చంద్రబాబు నాయుడు, యువ నాయకులు నారా లోకేష్ నేతృత్వంలో వారి సూచన మేరకు అందరిని కలుపుకొని పోయి సమిష్టి కృషి చేస్తూ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అభినందనలు తెలిపారు. అనంతరం కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు.

జిల్లాలోని టిడిపి కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - కడప : మహానాడు కార్యక్రమానికి మేము ఎన్నో ప్రాంతాలకు వెళ్ళి వారి ఆతిధ్యం స్వీకరించాము.కానీ ఈనాడు కడప జిల్లాలో మన ప్రాంతంలో తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు,నాయకులకు మేము ఆతిథ్యం ఇవ్వడం చాలా గర్వకారణంగా ఉంది. ఈ అవకాశం కల్పించిన మా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు యువనేత నారా లోకేష్ నా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ దియేటర్ వద్ద శనివారం సందర్భంగా మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహా పుణ్యకారంలో తన మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొనాలని పేర్కొన్నారు.

వికసిత సంకల్ప అభియాన్ కార్యక్రమం

విశాలాంధ్ర-కడప : కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు వారు వై ఎస్ అర్ జిల్లా కడప మండల పరిధిలోని నానపల్లి పంచాయితీ నందు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం రెండవ రోజు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంగేష్ దుబే శాస్త్రవేత్త భారత నూనె గింజల పరిశోధన సంస్థ వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలతో రైతుల ప్రత్యక్ష సంభాషనలను మరియు వారికి ఖరీఫ్ పంట కాలం ముందు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడానికి 700 జిల్లాలలో రెండువేల కంటే ఎక్కువ శాస్త్రీయ బృందాల భాగస్వామ్యంతో నూతన సాంకేతిక మరియు ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం కొరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి వ్యవసాయ పరిశోధనా స్థానం ఊటుకూరు వారు ఖరీఫ్ సాగుకు ముందు తీసుకోవాల్సిన మెలుకువలు గురించి వివరించారు ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీమతి సుభాషిని, జిల్లా ఉద్యాన అధికారి గారు మాట్లాడుతూ ఉల్లి సాగులో మెలకువలు గురించి, సాధారణంగా సాగు చేసే ఉల్లి నుంచి వినూత్నమైన పంటలైన డ్రాగన్ అంజూర మరియు ఇతర పూల పంటల సాగును అలవర్చుకోవాలని మరియు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాం సూక్ష్మ నీటి పథకాన్ని పాలిహౌస్ పథకాన్ని రైతు సంఘాలకు ఇచ్చే పథకాలను మరియు పంట కోత అనంతరం నిల్వ చేసుకునే పద్ధతులు మరియు పథకాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ పాండురంగారెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్ పశువైద్య కళాశాల ప్రొద్దుటూరు వారు మాట్లాడుతూ పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు వాటికి సంబంధించిన వ్యాధులు టీకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలైన డాక్టర్ కే సాయి మహేశ్వరి డాక్టర్ ఐ సురేష్ కుమార్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి నాగభూషణ్ రెడ్డి మండలం ఉద్యాన అధికారి సింధూరి ఏఈవోలు పావని, మెహరాజ్ ఆత్మ బిటియం నాగిరెడ్డి మరియు 50 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదు అంటించుకునే వ్యాధి

విశాలాంధ్ర-రాయచోటి: ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదు అంటించుకునే వ్యాధి సుండుపల్లె ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ఎస్ ఫర్హాన అన్నారు. శుక్రవారం సుండుపల్లె బస్టాండ్ ఆవరణంలో నటరాజ కళాబృందం వారిచే వీధి నాటకము ద్వారా ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కళా రంగ ప్రదర్శనలో ప్రజలను ఉద్దేశించి డాక్టర్ మాట్లాడుతూ ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్న చూడడం తగదన్నారు. సమావేశంలో ప్రాజెక్ట్ మేనేజర్ స్వాతి మాట్లాడుతూ వ్యాధి నివారణకు ప్రజా చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో తాము అహర్నిశలు కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులకు కూడా అన్నివేళలా అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రవీణ, ఓఆర్ డబ్ల్యు అంజనమ్మ, సుహాసిని, అలేఖ్య, పిఈ రమణమ్మ, ఎల్ డబ్ల్యూఎస్ డిఆర్పి అల్లావలి, నటరాజ కళాబృందం ప్రజలు పాల్గొన్నారు.

ముత్యాల రామ్ గోవింద్ రెడ్డిని సత్కరించిన మేడా

విశాలాంధ్ర -నందలూరు : ఉమ్మడి అన్నమయ్య జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డిని నందలూరు మండల అధ్యక్షులు మేడా విజయభాస్కర్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండల అభివృద్ధి పనుల విషయంగా తన వంతు బాధ్యతగా ఎల్లవేళల సహాయ సహకారాలు అందించడానికి ప్రజా సేవలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చినట్లు మేడా విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన పాల్గొన్నారు

అన్నమయ్య డ్యాం భాదితుల సమస్యలను

ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : అన్నమయ్య డ్యాం భాదితుల సమస్యలను ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుపోయి పరిష్కరించి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ భాదితులకు హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ పర్యవేక్షణలో శుక్రవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇంఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు తదితరులు నందలూరు మండలంలోని తోగూరుపేట, రాజంపేట మండలంలోని మందపల్లి, పులపత్తూరు, హరిజనవాడ తదితర ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో అన్నమయ్య డ్యాం ను,మరియు భాదితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేనపార్టీ ప్రజలకు వెన్నంటే అండగా ఉంటుందన్నారు. పేద ప్రజల అబివృద్ధి కోసం జనసేనపార్టీ ఆవిర్భవించిందన్నారు. గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యానికి అన్నమయ్య డ్యాం తెగిపోయి అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొంత మంది నిరాశ్రయులయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నమయ్య డ్యాం భాదితులకు పునరావాసం కల్పించడంలో ఆరాచక వైసిపి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని విమర్శించారు. అన్నమయ్య డ్యాం విషాదం రాష్ట్రాన్ని కుదిపేసిందన్నారు. అన్నమయ్య డ్యాం వలన భాదితులకు జరిగిన నష్టం వివరాలన్నింటిపై సమగ్రమైన నివేదికను సిద్ధం చేసి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుపోయి అందరి సమ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పేద, బడుగు బలహీన వర్గాల అబివృద్దే జనసేనపార్టీ ప్రధాన లక్ష్యం అన్నారు. అన్నమయ్య డ్యాం భాదితుల అందరిలో సంతోషాన్ని నింపుతామన్నారు. అన్నమయ్య డ్యాం భాదితుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు జోగినేని మణి, పిసిఎన్ బ్రదర్స్ పగడాల చంద్రశేఖర్, వెంకటేష్, సర్పంచ్ కారుమంచి సంయుక్త, అతికారి కృష్ణ, ముద్దపోలు రామ సుబ్బయ్య,ఉత్తరాది శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టిడిపి కార్యకర్త మృతి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : కడపలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి గురువారం వెళ్లి కార్యక్రమంలో పాల్గొని సంతోషంగా ఇంటికి వచ్చి అర్ధరాత్రి ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుతో పెద్ద రెడ్డి రంగారెడ్డి (50) మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద రెడ్డి కుటుంబం తెలుగుదేశం పార్టీకి పూర్వకాలం నుంచి అనుబంధం ఉండడంతో గురువారం కడప మహానాడుకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. పందిళ్లపల్లి గ్రామం గుండ్ల చెరువు స్వగ్రామానికి వెళ్లి ఆయన పార్థవ దేహాన్ని పరిశీలించి కుటుంబాన్ని పరామర్శించి పెద్ద రెడ్డి రంగారెడ్డి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడిపి ఇంచార్జ్ యనమల మదనమోహన్, టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి , మూగి వెంకటరమణ , బుల్లెట్ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాధ శవానికి అంత్యక్రియలు

విశాలాంధ్ర - ఖాజీపేట : బీచువారిపల్లి గ్రామంలో నివసించే కాశయ్య అనాధగా మృతి చెందడంతో అంత్యక్రియలు చేయడానికి తన వాళ్ళు ఎవరూ లేనందున ఆ కార్యక్రమాన్ని అదే గ్రామానికి చెందిన శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్ రెడ్డి ట్రస్ట్ మెంబర్లతో కలిసి కాశయ్యకు అన్నీ తానై బ్యాండ్ మేళాలతో, హిందూ సాంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు చేశాడు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులందరూ కలిసి కాశయ్య ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సందడి అమర్నాథరెడ్డి, అంజి, హరికృష్ణ, మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నోచేస్తూ పలువురు మన్నలను పొందుతున్నారని గ్రామస్తులు ట్రస్టు సభ్యులను ప్రశంసిస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల కోటర్స్‌కు

మరమ్మతులు చేయించాలి

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న పర్మినెంట్ కార్మికులు చలపతి రావు కాలనీలో నివాసముంటున్న కోటర్స్ ను కమీషనర్ తక్షణమే పరిశీలన చేసి పాడైపోయిన కోటర్స్ ను మరమ్మతులు చేయించాలని, డైలీ వేజెస్ పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల వేతనాలు చెల్లింపులో అలసత్వానికి కారనం అవుతున్న ఆడిటర్ పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అనుబంధమైన మదనపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అద్యక్ష కార్యదర్శిలు మస్తాన్ చలపతి నాయుడు కోరారు . శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికులకు హెచ్ ఆర్ ద్వారా కోటర్స్ కు మున్సిపాలిటీకి అద్దె చెల్లిస్తున్నారని కోటర్స్ పాడై పోయి వర్షాలకు నీరుకారుతున్నాయని తక్షణమే కమీషనర్ పర్మినెంట్ కార్మికుల కోటర్స్ ను పరిశిలన చేసి పాక్షికంగా దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. ఆప్కాస్ కార్మికులకు ఈపిఎఫ్ సమస్యలు పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్న పరిష్కారం చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అర్హులైన పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు ఇంటి స్థలాలు, పట్టాలు ఇచ్చి ప్రభుత్వమే ఇండ్లను నిర్మించాలని కోరారు .డైలీ వేజెస్ పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు రాక వారి కుటుంబ పోషణ అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారని, ఇంటి అద్దెలు చెల్లించక ఇంటి యజమానులు ఇళ్వను ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తూ ఇబ్బందులు పడుతున్నారని, కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ఆలస్యానికి కారణం అవుతున్న ఆడిటర్ పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోని డైలీ వేజెస్ పారిశుద్ధ్య కార్మి కులకు పెండింగ్లో ఉన్న ఐదు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, కృష్ణప్ప,జానకి, దేవా, సంజీవ, వాసు,చంద్ర, ఇంద్రాణి, రాధా పాల్గొన్నారు.

కాలేటివాగు ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలారెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: కాలేటివాగు ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలా రెడ్డి ఆరోపించారు. పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండల పరిధిలోని కాలేటి వాగు ప్రాజెక్టును శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గండి క్షేత్రంలోని వీరాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇడుపులపాయలో వైయస్సార్ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పులివెందులపై కక్ష పెంచుకున్నారన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి హయం లో పూర్తయిన అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం తమ పేరు వేసుకొని ప్రచారాలు చేస్తుందని విమర్శించారు. కాలేటి వాగు ప్రాజెక్ట్ గతంలో 0.33 టీఎంసీల నుండి 1.33 టీఎంసీలకు సామర్థ్యం పెంచి ప్రాజెక్ట్ ను నిర్మించారన్నారు. వైఎస్ఆర్సిపి హాయంలో 90శాతం పనులు పూర్తయినా మిగిలిన10శాతం పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోతుందని దుయ్యబట్టారు. కాలేటి వాగు ప్రాజెక్టు పూర్తయితే చక్రాయపేట పాటు కుప్పం ప్రాంత రైతులకు కూడా మేలు జరుగుతుందిని,హెచ్ ఎన్ ఎస్ ద్వారా గతంలో కుప్పానికి నీరు అందించామన్నారు. చంద్రబాబుకు రైతులపై ఎందుకు అంత వివక్ష ఎందుకని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ఏ రైతు కూడా సంతోషంగా లేరని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు గతంలో 40 కోట్ల మేరా నష్టపరిహారం అందించామని వెల్లడించారు. పెండింగ్ లో ఉన్న ఆరు కోట్ల రూపాయల బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. కాలేటి వాగు శిథిలావస్థకు వచ్చే పరిస్థితి తీసుకురాకండన్నారు. జగన్‌కు అధికారం వచ్చి ఉంటే కాలేటి వాగు ప్రాజెక్ట్ పూర్తయ్యే దని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న కాలేటి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని శ్యామలారెడ్డి డిమాండ్ చేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక కడప రోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి తనిఖీ చేశారు. చైర్మన్ వెంట కమీషనర్ శేషఫణి కూడా ఉన్నారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత పట్ల వీరు సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యం అందుతున్న తీరుపై అక్కడే ఉన్న రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉన్నాయా, మందుల కొరత ఉందా అంటూ ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను వీరు కలియతిరిగారు. ఇబ్బందులను తమ దృష్టికి తేవడం ద్వారా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చొరవతో పరిష్కారం పొందాలని వారు సూచించారు. ఆసుపత్రి వైద్యులు శ్రీనాథ్‌రెడ్డి, సూపర్‌వైజర్ ఓబులేసు, ఫార్మసిస్టు సుభాష్, ల్యాబ్ టెక్నీషియన్ అహ్మద్, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందితో చైర్మన్ మాట్లాడారు.

గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలి

విశాలాంధ్ర-పులివెందుల: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కృషి చేయాలని పులివెందుల అసెంబ్లీ ఇన్‌చార్జి బిటెక్ రవి టిడిపి కార్యకర్తలకు సూచించారు. పులివెందుల పట్టణ పరిధిలోని సరస్వతీ విద్యామందిరం వెనుక ఉన్న ఆయేషా మజీద్ వీధిలో నివాసముంటున్న షేక్ బాషా (వేల్పుల బాషా) వారి కుటుంబ సభ్యులు, అనుచరులు రఫీ, వలి, మాబాషా, షబ్బీర్, బాషా, బాబావలి, హరీఫ్, మహ్మద్, రహీముల్లా, సత్తార్, ఇమాంబి, సాధకున్, మున్ని, షబానా, ఖాజాబీ, గౌషియా, తస్లీం శుక్రవారం టిడిపిలో చేరారు. స్వచ్ఛందంగా పార్టీలో చేరిన వారిని బిటెక్ రవి సాదరంగా కండువాగప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో సమస్యలను పరిష్కరించే విధంగా వార్డు అభివృద్ధి కోసం టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి తెలియజేశారు.

నేడు పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం:ఎంపిడిఓ

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండలంలోని మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో 14 సచివాలయంలో అర్హులైన ప్రతి లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్ సొమ్మును రెండు కోట్ల తొమ్మిది లక్షల 53 వేల రూపాయలు మొత్తం పింఛన్లు 4876 మందికి సచివాలయం ఉద్యోగులు పంపిణీ చేయనున్నట్లు ఇన్చార్జ్ ఎంపీడీఓ వీర కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బుధవారం నగదు విత్ డ్రా చేసుకోవడం జరిగిందని గురువారం ఉదయం నుండే పింఛన్‌దారుల ఇంటి వద్దకే వెళ్లి సచివాలయ ఉద్యోగులు పింఛన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఉద్యోగస్తులు అలసత్వం వహించరాదని, అలసత్వం వహిస్తే వారి మీద క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు, కార్యక్రమంలో ఏఓ మల్లికార్జునరావు, ఇన్చార్జి విస్తరణ అధికారి సురేష్ బాబు, ఎంపీడీవో ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ సుజనేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎసిసి రైతులకు న్యాయం చేయాలి

నియోజకవర్గ సిపిఐ నేత సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-మైలవరం : మండలంలోని వద్దిరాల పరిసర ప్రాంతాలలో సిమెంట్ పరిశ్రమ నిర్మిస్తామని గత 30 సంవత్సరాలుగా రైతులను మోసం చేస్తున్న ఎసిసి యాజమాన్యంపై చర్యలు తీసుకొని భూ బాధిత రైతులకు న్యాయం చేయాలని జమ్మలమడుగు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సుబ్బారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం మండల కేంద్రమైన మైలవరంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల ప్రథమ మహాసభ సమావేశం కట్టమీద మారెమ్మ గుడి వద్ద వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలోని టెక్స్ టైల్ పార్కుకు నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని, ఏళ్ల తరబడి నిర్మాణం కాకుండా ఉండడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండలంలోని వద్దిరాల గ్రామంలో గత 30 సంవత్సరాల నుండి ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోవడంతో భూములు ఇచ్చిన రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని సకాలంలో పరిశ్రమ నిర్మించి ఉంటే తమ పిల్లలకు ఉద్యోగం అవకాశాలు దక్కి జీవితాలు మెరుగుపడేవని ఆ దిశగా యాజమాన్యం చొరవ చూపకపోవడం దురదృష్టకరమన్నారు ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎం ప్రసాద్, నేతలు లక్ష్మీనారాయణ, నాగేంద్ర, రాంప్రసాద్, కృష్ణ, మునిరెడ్డి, గురు స్వామి, మధు, తదితరులు పాల్గొన్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా కృష్ణ, సహాయ కార్యదర్శిగా వెంకట్ రమణ, మున్నెడ్డి, కోశాధికారిగా గురు స్వామి మరో 12 మంది ని కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పారా మెడికల్ విద్యార్థుల పరీక్షా ఫీజు గడువు పెంచి పరీక్షలు వాయిదా వేయాలి

విశాలాంధ్ర-కడప రూరల్ : అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఆర్ఓ కె.విశ్వేశ్వర నాయుడుని రిమ్స్ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ విద్యార్థులపై జరుగుతున్న కక్ష సాధింపు చర్యలు ఆపాలని పరీక్ష ఫీజు గడువు పెంచి పరీక్షలు వాయిదా వేయాలని వినతి పత్రం అందించి కోరారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి. వలరాజు మాట్లాడుతూ కడప రిమ్స్ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ చదువుతున్న విద్యార్థులు రాయలసీమ నలుమూలల నుండి వచ్చే అభ్యసిస్తున్నారన్నారు. అయితే కాలేజీలో విద్యార్థులకు వసతి గృహం కల్పించాలని, విద్యార్థులతో వెట్టిచాకిరి మానుకోవాలని ప్రశ్నించినందుకు పారా మెడికల్, పెదాలజీ హెచ్ఓడీ శోభారాణి విద్యార్థులపై కక్ష సాధింపులో భాగంగా హాజరు శాతం తక్కువ ఉందని 35 మంది గాను 21 మందిని యూనివర్సిటీ పరీక్ష ఫీజు కట్టించకుండా నిలిపి వేసే దుర్మార్గ చర్యకు పాల్పడ్డారని అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ అడుగుతున్నదన్నారు. విద్యా సంవత్సరానికి సంబంధించి పెదాలజీ డిపార్ట్మెంట్లో మొత్తం క్లాసులు 198 బోధించామని తెలిపారు. మొదటి సంవత్సరంలో 43 తరగతులు జరిగాయి. రెండవ సంవత్సరానికి 64 జరిగాయి. కానీ వీళు మొత్తానికి గాని 198 తరగతులు బోధించి 198 పూర్తి చేశారన్నారు. పారా మెడికల్ పరీక్ష ఫీజు వచ్చిన కారణంగా వెంటనే విద్యార్థులకు కూడా సమాచారం ఇవ్వకుండా తమకు అనుకూలంగా ఉన్న వాళ్లకు మాత్రమే హాజరు వేసుకొని 21 విద్యార్థులను దబాయిస్తూ బానిసల లాగా వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. విద్యార్థులు ప్రశ్నిస్తే, మాట్లాడితే పారా మెడికల్ విద్యార్థులకు ఏ ఒక్కరోజు క్లాస్ బోధించినటువంటి, పర్యవేక్షణ చేయనటువంటి పారామెడికల్ విద్యార్థుల పట్ల చిన్నచూపు చూస్తున్నటువంటి వైద్య విద్య చదువుకున్న టువంటి హెచ్ఓడి శోభారాణి ఇలాంటి నియంత వైఖరి రిమ్స్‌లో చదువుతున్న మెడికల్ విద్యార్థులకు చాలా ప్రమాదమని విద్యార్థులను సమస్యల్లో ఉంచి పైశాచిక ఆనందం పొందే ఇలాంటి వారి నుండి విద్యార్థులను పరీక్ష ఫీజు గడువు పెంచి తరగతులు పూర్తిగా బోధించి వారి భవిష్యత్తును కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి అరుణ్ డీఎల్ఎంటీ విద్యార్థులు తేజ, చైతన్య, సాయి కుమార్, సంతోష్, చరణ్ తేజ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కమనీయం వెంకటరమణ స్వామి కళ్యాణం

విశాలాంధ్ర-రామసముద్రం: మండలంలోని మినికి గ్రామం వద్ద వెలసిన కళ్యాణ వెంకటరమణ స్వామి కళ్యాణం శుక్రవారం అత్యంత కమనీయంగా జరిగింది స్వామివారి తిరునాళ్లలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేతుడైన వెంకటరమణ స్వామి కళ్యాణం ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు ఉదయం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు

వైభవంగా సీతారాముల కళ్యాణం

విశాలాంధ్ర-వాల్మీకిపురం : టిటిడి ఆధ్వర్యంలోని స్థానిక పట్టాభి రామాలయంలో శుక్రవారం శ్రీరాముడు జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణలు మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో సుప్రభాత సేవత కార్యక్రమాలు ప్రారంభమై నిత్యసేలు అనంతరం ముస్తాబైన శ్రీ సీతారాములవారిని ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో అధిరోహింపచేసి, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కనుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణోత్సవ ఆర్జిత సేవకు హాజరైన దంపతులకు ఉచితంగా స్వామి వారి వస్త్రాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజు వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు

కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపిన నల్లారి

విశాలాంధ్ర-వాల్మీకిపురం: అన్నమయ్య జిల్లా పీలేరు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహానాడు బహిరంగ సభకు తరలి వెళ్లిన పీలేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు, శ్రేణులు, కార్యకర్తలు మహిళలు అనుబంధ సంఘాలు నల్లారి అభిమానులు అందరూ పీలేరు నియోజవర్గం నలుమూలల నుండి పాల్గొని మహానాడు కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన అందరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

మిట్స్‌లో అంతర్జాతీయ సమావేశం, వర్క్‌షాప్

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె సమీపం లోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ లోని ఇంగ్లీష్ %డ% ఫారిన్ లాంగ్వేజెస్ విభాగం వారు భాష మరియు సాహిత్యంపై రెండు రోజుల అంతర్జాతీయ సమావేశం మరియు వర్క్‌షాప్‌లను నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామనాథన్ అన్నారు. సాహిత్యం మరియు భాషా పరిశోధనలో ఉద్భవిస్తున్న పరిశోధకులు మరియు విద్యార్థులు ఆంగ్ల సాహిత్యం, భాషా బోధన మరియు భాషాశాస్త్రంలో సమకాలీన ధోరణులపై లోతైన విద్యా చర్చలలో పాల్గొనడానికి అంతర్జాతీయ వేదికను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది అన్నారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌ను సాహిత్యం తో జత పరుస్తూ బాషా బోధన ను ముందు కు తీసుకువెళ్లడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం. వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ యుగంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైన్స్ మరియు టెక్నాలజీ భాష మరియు సాహిత్యంతో కలిసిపోవడం విద్యా రంగాన్ని పునర్నిర్మించడమే కాకుండా విద్యార్థులు మరియు విద్యావేత్తలు భాషతో సంభాషించే మార్గాలను కూడా పునర్నిర్వచిస్తోంది అని అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మరియు వైస్ ప్రిన్సిపాల్ ప్రొసీడింగ్స్‌ను ఆవిష్కరించారు. తరగతి గదిలో, ఏఐ (ఆధారిత అభ్యాస వేదికలు విద్యార్థుల విభిన్న అవసరాలు మరియు నైపుణ్య స్థాయిలను తీర్చే అనుకూలీకరించిన పాఠ్య ప్రణాళికలను అనుమతి స్తాయి అని అన్నారు. మరోవైపు, సైన్స్ ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన అభివృద్ధికి దోహదం చేస్తుంది, సాహిత్యానికి న్యూరోకాగ్నిటివ్ ప్రతిస్పందనలను అన్వేషించడానికి, బయోఫీడ్‌బ్యాక్ పరికరాల ద్వారా భావోద్వేగ ప్రతిధ్వనిని కొలవడానికి మరియు మెదడు-ఇమేజింగ్ టెక్నాలజీని ఉపయోగించి భాషా సముపార్జనను అర్థం చేసుకోవడానికి పండి తులను ప్రోత్సహిస్తుంది. ఇంగ్లీష్ %డ% విదేశీ భాషల విభాగానికి చెందిన అధ్యాపకులు మరియు విద్యార్థులు, విభాగాధిపతి డాక్టర్ పి. అథహార్ ఇందులో పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన నల్లారి యువసేన

విశాలాంధ్ర -మదనపల్లి: నల్లారి యువసేన గుర్రంకొండకు కొత్తగా నియామకమైన ఎస్సై రఘురాంను శుక్రవారం సన్మానించారు ఈ సందర్భంగా ఎస్సై రఘురాం మాట్లాడుతూ గుర్రంకొండలో శాంతి భద్రతలు కాపాడుతానని అన్నివేళలా గుర్రంకొండ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని ఏదైనా సమస్యలుంటే వెంటనే మనకు తెలియజేయాలని ఆయన తెలియజేశారు. నల్లారి యువసేన సభ్యులు తో మాట్లాడుతూ గుర్రంకొండ విశేషాలు అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఎండి జమీర్ ఖాన్, ఎస్ ఎల్ టి బబ్లాన్ జన్మభూమి కమిటీ నెంబర్ పర్వేజ్ అహ్మద్ మరియు నల్లారి యువసేన సభ్యులు టిడిపి కార్యకర్తలు కలిశారు.

బాలికల ఆర్థిక అక్షరస్యతపై అవగాహన: సీడీపీఓ

విశాలాంధ్ర-గాలివీడు : బాలికలు ఆర్థిక అక్షరస్యతపై అవగాహన కలిగివుండాలని తద్వారా కుటుంబ మనుగడ సాధ్యమవుతుందని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని నడింపల్లి అంగన్వాడీ కేంద్రంలో కిశోరీ వికాసం-ఆర్థిక అక్షరస్యతపై వేసవి సెలవుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమే మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ పాటించడం, బడ్జెట్ తయారీ, పొదుపు, పెట్టుబడులు, అవసరాలు, కోరికలు, భవిష్యత్ లక్ష్యాలు, ఆర్థిక ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీస్ సూపర్వైజర్ సోనీ, కిశోరీ బాలికలు, చిన్నపిల్లలు, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

యోగాపై ఉపాధి కూలీలకు అవగాహన

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి మండలం నందిపల్లి అమృత సరోవరం వద్ద ఎంపీడీవో కులాయమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధి కూలీలకు యోగ పై అవగాహన కల్పించారు. సందర్భంగా ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామం మీద యోగ నిపుణులు రాజశేఖర్, గంగాధరల ఆధ్వర్యంలో ఆసనాలు వేయించార. అనంతరం కులాయమ్మ మాట్లాడుతూ యోగ అనేది మన దేశానికి వారసత్వంగా వస్తుందన్నారు. భారతీయ జీవన విదానంలో ఒక భాగం అని ఎంపిడివో తెలియజేశారు. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత, దేహ దారుఢ్యం లభిస్తాయని డాక్టర్ వైద్యనాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలుర పాఠశాల పిడి రాజశేఖర్, ఏపీ ఓ పార్వతి, నంది పల్లె పంచాయతీ కార్యదర్శి చరణ్ కుమార్, కత్తలూరు పంచాయతీ కార్యదర్శి శివకుమార్, కత్తలూరు సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఛలో సిద్ధేశ్వరం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పులివెందుల: రాయలసీమ సస్యశ్యామలం కోసం రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో సిద్దేశ్వరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సభ్యులు సదా ఓబులరెడ్డి, రైతు సంఘం ప్రతినిధి కొండారెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ పాపన్నరాయల్‌లు పిలుపునిచ్చారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా సంగమేశ్వరం వద్ద శనివారం భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. అలాగే ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాయలసీమ అన్ని రంగాలలో బాగా వెనుకబడి ఉన్నందున ఈ వివక్షతను ప్రశ్నిస్తూ రాయలసీమ సాగునీటి సాధన సమితి పిలుపునందుకొని రాయలసీమ ప్రజానీకం స్వచ్ఛందంగా 30 వేలమందికిపైగా గతంలో సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన చేసి తాము పడుతున్న బాధలను ప్రపంచానికి వెలుగెత్తి చాటామన్నారు. ఈ సభకు కడప పులివెందుల నుంచి వందల మంది రైతులు హాజరు కానున్నారు రాయలసీమ జిల్లాల నుంచి భారీ ఎత్తున రైతులు సంగ మేశ్వరం వద్ద జరిగే సభకు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలి వారు విజ్ఞప్తిచేశారు.

ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువు పెంపుపై హర్షం

విశాలాంధ్ర-వేంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు ఇస్తున్న గుర్తింపును 8 నుండి పది సంవత్సరాలకు పెంచడం హర్షనీయమని కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు లిపాఠశాల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షులు బిఎన్ రమణారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి మూడవ తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఉండవల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రైవేట్ పాఠశాలలకు ప్రస్తుతం ఇస్తున్న ఎనిమిది సంవత్సరాల గుర్తింపును 10 సంవత్సరాలకు పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు జీవో ఎంఎస్ నెంబర్ 24ను జారీ చేయడం పట్ల నారా లోకేష్, ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని జీవో జారీ చేయడానికి కృషిచేసిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

జూన్ 2న సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న మండల రెవెన్యూ కార్యాల యాల ఎదుట ధర్నా నిర్వహిస్తు న్నట్లు సీపీఐ మండల కార్యదర్శి శరత్ కుమార్ తెలిపారు. ధర్నాకు సంబంధించిన గోడ పత్రాలను శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. శరత్ మాట్లాడుతూ పట్టణాల్లో 2 సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున స్థలాలు ఇస్తామని ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చకపోవడం దారుణ మన్నారు. ఆయా హామీలను ప్రభుత్వం నెరవేర్చేలా ఒత్తిడి తెచ్చేందుకు ధర్నా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున, శీను, మహేష్, బహదూర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలోని టెక్స్‌టైల్ పార్కు నిధులు కేటాయించాలి: సిపిఐ

విశాలాంధ్ర - జమ్మలమడుగు : మైలవరంలోని టెక్స్‌టైల్ పార్కు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 5వ పట్టణ మహాసభ జమ్మలమడుగులోని వివేకానంద కళాశాల యందు చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఏరియా కార్యదర్శి సుబ్బారెడ్డి సిపిఐ జెండా ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ మైలవరం మండలంలోని టెక్స్టైల్ పార్కు నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని ఏళ్ల తరబడి నిర్మాణం కాకుండా ఉండడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. మండలంలో గత 14 సంవత్సరాల నుండి ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోవడంతో భూములు ఇచ్చిన రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని తెలిపారు. సకాలంలో పరిశ్రమ నిర్మించి ఉంటే తమ పిల్లలకు ఉద్యోగం అవకాశాలు దక్కి జీవితాలు మెరుగుపడేవని ఆ దిశగా యాజమాన్యం చొరవ చూపకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అయినా పరిశ్రమ నిర్మాణానికి చర్యలు చేపట్టి రైతులకు గతంలో భూములకు నష్టపరిహారం చెల్లించిన మొత్తం ఏ మూలకు సరిపోదని ప్రస్తుతం భూములకు తిరిగి అదనంగా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రాజోలు ప్రాజెక్టుకు నిధుల కేటాయించి 2.95 టీఎంసీ నీరు నిలువ పెట్టి దిగువ ప్రాంతానికి చివరి ఆయకట్ట వరకు సాగునీరు ఇవ్వాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిత్యం స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం ద్వారానే కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి చెందుతుందని ఆదిశగా పట్టణం సమితి సభ్యులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎం ప్రసాదు, నాగేంద్ర, రాంప్రసాద్, సంతోష్, అరవింద్, సాయి, సిపిఐ మైలవరం మండల నాయకులు కృష్ణ, వెంకటరమణ, ముని రెడ్డి, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ అలవెన్స్, హామీలకు జీవోలకై ఉద్యమం

జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి. వేణుగోపాల్ డిమాండ్

విశాలాంధ్ర-కడప రూరల్ : పెండింగ్‌లో ఉన్న లెప్రసీ అలవెన్సులు తక్షణం చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వాటికి జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కార్యచరణ నిర్ణయించినట్లు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి. వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న లెప్రసీ అలవెన్సులు ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ వాటిని ఆశా కార్యకర్తలకు ఇవ్వకుండా తిరిగి ప్రభుత్వానికి వాపసు చేశామని అధికారులు తెలియజేయడం జరిగిందని తక్షణం వాటిని జూన్ నెల పదవ తేదీ నాటికి తెప్పించి ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 62 సంవత్సరములకు రిటైర్మెంట్ వయసు పెంపు, గ్రాడ్యుటి లక్షల 50 వేల రూపాయలు, మెటర్నిటీ సెలవులు వాటికి మూడు నెలలు అయినా ఇంతవరకు జీవోలు జారీ చేయ లేదని జీవోలును జారీ చేయాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం జూన్ మూడో తేదీన 'ఆశా డే' సందర్భంగా అన్ని పిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలోని మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రం ఇవ్వాలని, జూన్ 11, 12, 13, 14, 15తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు జరుగుతాయని, 16వ తేదీ కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ, కోశాధికారి సి. అమ్ములు పాల్గొన్నారు.

సెల్ టవర్ మీద నుండి కింద పడి యువకుడు మృతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక దొండపాడు రోడ్డులో ఉన్న జియో టవర్‌పైన మరమ్మత్తులు చేస్తూ ప్రమాదవశాత్త కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వేంపల్లె మండలం అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ముద్ది శివసాయి (27) అనే యువకుడు జియో సెల్ టవర్ సంస్థలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే విధి నిర్వహణలో సెల్ టవర్ పైకి ఎక్కి మరమ్మత్తు పనులు చేస్తుండగా కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జూన్ 4 వెన్నుపోటు దినం

అన్ని నియోజకవర్గాలలో నిరసన కార్యక్రమాలు

ఒక్కసారికే కడప టీడీపీ అడ్డా అనడం విడ్డూరం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కుటుమీ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు కాబట్టి రాష్ట్రవ్యాప్తంగా జూన్ 4 నుండి వెన్నుపోటు దినం కార్యక్రమాలు అన్ని నియోజకవర్గ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు రామ సుబ్బారెడ్డి మాజీ ఉపమఖ్యమంత్రి అంజాద్ భాష, ఎమ్మెల్యేలు అమర్నాథ్ రెడ్డి, దాసరి సుధా, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి.. లు అన్నారు. శుక్రవారం నగరంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచిన హామీలు నెరవేర్చలేదు కాబట్టి జూన్ 4 వెన్నుపోటు దినం కార్యక్రమాలు చేపడతామన్నారు. మోసాలకు,కుట్రలకు, అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించిన ఘనత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కి దక్కుతుందన్నారు. కాబట్టే ప్రజల గుండెల్లో మహానేతలుగా దివంగత ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. తర్వాత ఆ ఘనత సాధించిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి కె దక్కుతుందన్నారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క మంచి కార్యక్రమం గుర్తు వస్తుందా. అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటైన అమలు చేశారా.. మహానాడుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను బయపెట్టి , బెదిరించి తరలించారు.. మహానాడు కాదు.. అబ్బా కొడుకుల డబ్బా నాడు. అన్నారు. జగన్ భజన తప్ప ప్రజలకు మంచి చేశాం అని ఎక్కడా చెప్పలేదు.. కొత్తగా సూపర్ సిక్స్ పేరు మార్చి ఆరు శాసనాలు అంటూ కట్టు కథలు ప్రజలకు చెప్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఏ చిన్న సభ జరిగిన జగన్మోహన్ రెడ్డి కి వచ్చిన జనాన్ని చూస్తే అందులో మహానాడుకు సగం కూడా రాలేదన్నారు రాప్తాడు లో జరిగిన సిద్ధం సభకు వచ్చిన జనంలో 10 శాతం కూడా రాలేదు.. ప్రజాస్వామ్యం ఓడిందని ఏడాది తర్వాత ప్రజలు అంటున్నారు. ఏడాది పాలనలో ఒక్క పథకాన్ని అమలు చేశారా అని ప్రశ్నించారు, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అన్ని చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలకు ఇచిన హామీల అమలు కోసం ప్రజలతో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన అన్యాయాలు, మోసాలను వివరిస్తాం.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేసే కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తారన్నారు. ఈ సమావేశంలో డిసి గోవింద్ రెడ్డి, జిల్లా పరిశీలకులు కొండు అజయ్ రెడ్డి , డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి , మాజీ టిటిడి బోర్డు నెంబర్ యానాదయ్య , జిల్లా రైతు విభాగమ అధ్యక్షుడు సాంబటూరు ప్రసాద్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి , మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ , జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్ , కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ శ్రీరంజన్ రెడ్డి , తదితరులు ఉన్నారు.

రైతాంగాభివృద్ధికి సంకల్ప అభియాన్ : ప్రవీణ్

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : సోమిరెడ్డిపల్లి గ్రామములో రైతాంగం నూతనంగా ఒరవడికి వికసిత్ కృషిని, ఆదివారం కృషి సంకల్ప అభియాన్ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరై రైతన్నలకు సలహాలు అందిస్తారన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య, విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు అధికారులు పాల్గొంటారని అన్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి సంస్థలైన భారత వరి పరిశోధన సంస్థ నూనె గింజల పరిశోధన సంస్థ చిరుధాన్యాల పరిశోధన సంస్థ జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ జాతీయ వ్యవసాయ విస్తరణ నిర్వహణ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఎంపిక చేసిన గ్రామాలకు ముగ్గురు శాస్త్రవేత్తలు వెళ్లి రైతుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పంట క్షేత్రాలను సందర్శించి ఎలాంటి పంటలను సాగు చేయాలి అనేదానిపై రైతులకు వివిధ సంఘాల వారికి వివరించడం జరుగుతుందన్నారు. ఆధునిక పరికరాల వినియోగంలో స్మార్ట్ వ్యవ సాయాన్ని పద్ధతులను తెలియజేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ డ్రోన్ల ప్రత్యక్ష ప్రదర్శనలు పంట వైవిధ్యకరణ యంత్ర ఆధారిత వ్యవసాయం గురించి రైతులకు తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలన్నారు.

సీఎం చంద్రబాబు దృష్టికి బ్రాహ్మణుల సమస్యలు

విశాలాంధ్ర-వేంపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు సూగురు రఘునాథ్ రావు. పి వి ఎస్ వి ప్రసాదరావులు తెలిపారు. ఆ మేరకు మహానాడుకు విచ్చేసిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ద్వారా చంద్రబాబుకు వినతిపత్రం అందజేశామన్నారు. వారు మాట్లాడుతూ బ్రాహ్మణులకు ఉపయోగ పడే విధంగా బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ను పునః ప్రారంభించాలని బీసీ సంక్షేమ శాఖ నుండి తప్పించాలని స్వయం ప్రతి పత్తి కల్పించాలని కోరామన్నారు. . రాజకీయంగా బ్రాహ్మణులు ఎదగడానికి అవకాశం కల్పించాలని మండల, జిల్లా కమిటీ లలో పార్టీ పదవుల విషయంలో అవకాశం కల్పించి రాజకీయంగా సపోర్ట్ చేయాలని కూడా కోరామన్నారు. భృతి కోసం పట్టణాలకు వచ్చిన బ్రాహ్మణలకు సొంత ఇల్లు ఉండేలా చూడాలని సబ్సిడీ పథకాలు లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. రాబోవు కాలం లో ఎమ్మెల్సీ పదవులలో అవకాశం కల్పించాలని కోరినట్లు వారు వెల్లడించారు.

కారు బోల్తా పడి యువకుడి మృతి

విశాలాంధ్ర- మదనపల్లె : కారు బోల్తాపడిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కథనం మేరకు.. రాయచోటి పట్టణానికి చెందిన సుహైల్ గత కొన్నిరోజుల క్రితం కువైట్ కి వెళ్ళాడు. గురువారం అక్కడ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. దీంతో రాయచోటి పట్టణానికి చెందిన అతని స్నేహితులు మహమ్మద్ అలీ ఖాన్ (24) ముజిమిల్ (23) ఖాదర్ ఖాన్ (24) నవాజ్ (24)లు రిసీవ్ చేసుకోవడానికి గురువారం రాత్రి కారులో బెంగళూరు విమానాశ్రయానికి వెళ్లారు. తన స్నేహితుడిని సాదరంగా ఆహ్వానించి సంతోషంగా ఐదుగురు కలిసి కారులో రాయచోటికి బయలుదేరారు. మార్గమధ్యంలోని కురబలకోట సమీపంలో జంగావారిపల్లి వద్ద కారు అదుపుతప్పి పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బాధితులను కురబలకోట 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నవాజ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన నలుగురు యువకులను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న మృతుడు కుటుంబ సభ్యులు, బాధితుల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.బాధితులను పరామర్శించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్ బాష కారు ప్రమాదంలో గాయపడి రాయచోటికి చెందిన యువకుడు మృతి చెందడంతో సమాచారం అందుకున్న రాష్ట్రమంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్ బాషలు వేరు వేరు సమయాల్లో ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. గాయపడిన బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు . ప్రమాద ఘటన వివరాలను తెలుసుకున్నారు. బాధితులు కోలుకునే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మహానాడు సభ అందరూ కృషితో విజయవంతం

తెదేపా యువనేత కానాల మల్లికార్జునరెడ్డి

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మైదుకూరు నియోజకవర్గంలో ఉన్న బ్రహ్మంగారిమఠం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు అందరు కృషితో కడపలో జరిగిన మూడు రోజులు పాటు సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలుగుదేశం పార్టీ యువనేత కానాల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో మొట్టమొదట సారిగా తెలుగుదేశం పార్టీ మహానేత నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీని 43వ మహానాడు సభను కడపలో ఎంత భారీగా సక్సెస్ కావడం కేవలం కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానుల కృషితోనే విజయవంతం అయిందని ఆయన పేర్కొన్నారు. మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఇచ్చిన ఆదేశాల మేరకు బ్రహ్మంగారిమఠం మండలం నుండి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి పర్యవేక్షణలో భారీగా కార్యకర్తలు తరలించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎం తనయుడు ఆంధ్ర ప్రదేశ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు రావు, రాష్ట్ర మంత్రులు పార్లమెంట్ సభ్యులు, జిల్లాల ఇన్చార్జులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, తెలంగాణ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత, కడప పార్లమెంటు ఇన్చార్జి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సభ విజయవంతం కావడం అభినందనీయమని ప్రతి కార్యకర్త నాయకులు కృషితో సభను విజయవంతం చేశారని వారికి పేరుపేరునా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు చిన్నకుడాలలో గజ్జెపూజ

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలం చిన్నకుడాలలో శనివారం గజ్జెపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 8గంటలకు కలశ ఆరాధన, గజ్జె పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు రాత్రి 8గంటలకు గంగమ్మతల్లి కోలాట బృందం ఆధ్వర్యంలో చక్కటి కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమానికి ప్రజలు విచ్చేసి ఆనందింపజేయాల్సిందిగా వారు కోరారు.

నూతన పైప్ లైన్ ఏర్పాటుతో తాగునీటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర-లింగాల: లింగాల పంచాయతీ పరిధిలోని మసీదు వీధిలో తాగునీటి కోసం శుక్రవారం నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను వారు సర్పంచ్ జూలువాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి శుక్రవారం నూతన పైప్లైన్ మసీదు వీధిలో ఏర్పాటు చేశారు.పైప్ లైన్ ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

పసిబిడ్డను కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-మదనపల్లె: కడప జిల్లాలో మైలవరంలో ఆరు రోజుల కిందట అభం శుభం తెలియని పసిబిడ్డను కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని కోరారు జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ విలేకరుల సమావేశం నిర్వహించారు.కడప జిల్లాలో ఇటీవల అభం శుభం తెలియని మూడేళ్ల చిన్నారిపై జరిగిన హత్యాచారాన్ని జనసేన పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ తెలియజేశారు. ఈమేరకు జనసేన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ చిన్నారి మృతికి కారణమైన దోషులను కఠినంగా శించాలని, అధికారులు, పోలీసు యంత్రాంగం ఇలాంటి తప్పులు చెయ్యాలంటే బయపడేలా కొన్ని దేశాల్లో ఉన్నట్లు బహిరంగ శిక్షలు అమలు చెయ్యాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జనసేన లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ అమర నారాయణ మాట్లాడుతూ ఇలాంటి కేసుల్లో స్పెషల్ కోర్టులు ఏర్పాటు చేసి తప్పు చెయ్యాలనే ఆలోచన రాకుండా తీర్పులు వెలువరించాలని కోరారు. జనసేన సీనియర్ నాయకురాలు మాలతి మాట్లాడుతూ జనసేన ముఖ్య ఉద్దేశం మహిళల సంరక్షణ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు భవ్య, శోభ, సందీప్ రెడ్డి, రామ్మూర్తి, చిరంజీవి, రమణ, శేషగిరి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ఇంటలిజెంట్ ఎస్పీ ఈశ్వర్ రాజు

ఆలయ మర్యాదలతో స్వాగతం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయాన్ని విశాఖపట్నం ఇంటలిజెంట్ ఎస్పీ ఈశ్వర్ రాజు దర్శించుకున్నారు. ఆయనకు బ్రహ్మంగారి మఠం ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ప్రత్యేక స్వాగతం పలికి బ్రహ్మంగారికి ప్రత్యేక పూజలు కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ద్వారా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం బ్రహ్మంగారి కాలజ్ఞానం గురించి వారికి వివరించారు. అనంతరం స్వాములవారి శాలువ, పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను బ్రహ్మంగారి చిత్రపటాని కాలజ్ఞాని పుస్తకాన్నివారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూత భవిష్యత్ వర్తమాన కాలాన్ని భక్తులకు తెలియజేసిన కాలజ్ఞాని దర్శించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని విశాఖపట్నం నుండి బ్రహ్మంగారిని దర్శించుకోవడమే సంతోషకరమన్నారు. వీరి వెంట బ్రహ్మంగారి మఠం ఏఎస్ఐ గుర్రప్ప, ఆలయ సిబ్బంది సుబ్బరాయుడు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..ప్రమాదకరంగా మారిన గొయ్యి

విశాలాంధ్ర - గాలివీడు : మండల కేంద్రం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది.ఏమాత్రం ఏమర పాటుతో వున్నా వాహనదారులకు ప్రమాదం తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు. హైస్కూల్ నుండి శెట్టివారిపల్లెకు వెళ్లే మలుపులో ఇటీవల డ్రైనేజీ కాలువ పైకప్పు కుంగిపోవడంతో రెండు అడుగుల గొయ్యి ఏర్పడింది. దీంతో ఇప్పటికే పలుమార్లు ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి స్వల్ప గాయాలతో బయటపడగా, ఆమార్గంలో వెళ్లే మరికొందరు భయ భ్రాంతులకు గురవుతున్నారు. అంతేగాక రాత్రుళ్ళు సమయంలో కొత్త వ్యక్తులు,పాదాచారులు ఆ మార్గంలో వెళితే గోతిలో పడే ప్రమాదం లేకపోలేదు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డీసీసీబి చైర్మన్ సూర్యనారాయణరెడ్డి నియామకంపై అధికారిక ఉత్తర్వులు విడుదల

విశాలాంధ్ర -అట్లూరు: ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా మంచూరు సూర్యనారాయణరెడ్డి. నియామక ఉత్తర్వులు అధికారికంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం: 135 విడుదల చేసింది. రిజిస్టర్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీ నుంచి ప్రొసీడింగ్ త్వరలో రావాల్సి ఉంది. రాగానే డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయిటకు ఆహ్వాని స్తామని కడప కో-ఆపరేటివ్ బ్యాంక్ ఇంచార్జ్ సీఈవో రాజమణి తెలిపారు.

ప్రభుత్వ ప్రతిష్ట కోసం. కృషి చేస్తా ..చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి. వెల్లడి.

ఉమ్మడి కడప జిల్లా డిసిసి బ్యాంక్ నకు 106 సంవత్సరాలు చరిత్ర ఉందని , రైతులకు. న్యాయం జరిగేలా పాలకమండలి పనిచేస్తూ ప్రభుత్వ పటిష్టతకు పాటుపడేలా కృషి చేస్తానని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం తనపై నమ్మకంతో అతి పెద్ద బాధ్యత పెట్టిందని ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వ ఫలాలు రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.తన నియామకం కోసం కృషిచేసిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు.యువనేత నారా లోకేష్ బాబు. తెలుగుదేశం పార్టీ కి జీవితాంతం రుణపడి ఉంటానని, పదవి కి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త ఇంచార్జ్ రితీష్ కుమార్ రెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ మహానాడు ఒక ప్రహసనం

చంద్ర బాబు చెక్క భజన,లోకేష్‌ను పొగడడం,జగన్‌ను తిట్టడం :తులసి రెడ్డి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : అది మహా నాడు కాదు.మహా గోడు,మహా బోరు,మహా నస. ఆత్మ స్తుతి,పరనింద తప్ప మరేమీ లేదు. సుత్తి నాడు లేక డబ్బా నాడు అని పేరు పెట్టి వుంటే బాగుండేది. అధికార దుర్వినియోగం పరాకాష్టకు చేరింది. టిడిపి పేదల పార్టీ కాదు, కోటీశ్వరుల పార్టీ అని తెలిసి పోయింది. టిడిపి అంటే తెలుగు దేశం పార్టీ కాదు - తెలుగు దోపిడీ పార్టీ అని స్పష్టమయిందని రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం కడపలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌టిఆర్ నాటి మహానాడుకు,ప్రస్తుత మహానాడుకు నక్కకు,నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది అన్నారు. సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయి. పిల్లిని మార్జాలం,కుక్కను శునకం అన్నట్లు సూపర్ సిక్స్ ను ఆరు శాసనాలు అని పేరు మార్చి పెట్టారు. కార్యకర్తే అది నేత అని మొదటి శాసనం.ఒక వైపు మహానాడు జరుగుతుంటే మరొక వైపు కడప ఎన్ టి ఆర్ సర్కిల్ లో చిప్పగిరి మీనాక్షి అనబడే టిడిపి దళిత మహిళా కార్యకర్త పార్టీ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని నిరసనగా సెల్ టవర్ ఎక్కింది. ఇదీ మొదటి శాసనం పరిస్థితి. రెండవ శాసనం యువగళం అట.నెలకు రూ 3000 లు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వలేదు. ఇదీ రెండవ శాసనం పరిస్థితి. మూడవ శాసనం సామాజిక న్యాయం అట.బీసీ,యస్సీ,ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ హామీ ఇచ్చి అమలు చేయలేదు. నాల్గవ శాసనం స్త్రీ శక్తి అట.19- 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి మహిళకు ఆడ బిడ్డ నిధి క్రింద ప్రతి నెలా రు 1500 ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వ లేదు. ఐదవ శాసనం అన్న దాతకు అండ అట.అన్న దాత సుఖీ భవ పథకం కింద ఇప్పటివరకు పైసా ఇవ్వలేదు. ఆరవ శాసనం తెలుగు జాతి - విశ్వ ఖ్యాతి అట.పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేశాక విశ్వ ఖ్యాతి దేవుడెరుగు,రాష్ట్రం లోనే తెలుగు భాష, తెలుగు జాతి ఉనికి కోల్పోయే ప్రమాదముంది. ఆరు శాసనాలు రాబోవు రోజుల్లో టిడిపి కి మరణ శాసనాలు కావడం తథ్యం అని తులసి రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో ఏపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి సత్తార్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సలావుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్,ప్రసాద్ గౌడ్,జిల్లా కార్యదర్శి భువన ఏకాదశ రెడ్డి,మహిళా కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షురాలు శ్యామలమ్మ,రఫీక్ ఖాన్,మామిల్ల బాబు,నాగ రత్న ,అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

పాత రహదారిని సర్వే చేయకుండానే గొడవలకు అజ్యం పోస్తున్న తహశీల్దార్.?

విశాలాంధ్ర-రైల్వేకోడూరు : మండలం చియ్యవరం పంచాయితీ వడ్డిపల్లి గ్రామానికి చెందిన డికెటి భూములలోకి పోవడానికి రావ డానికి పాత రహదారి ఉన్నా సర్వే చేయకుండానే చంద్రగిరి వెంకటేష్ కు చెందిన భూమి మధ్యలో రహదారి ఇవ్వాలని తహశీల్దార్ మరో వర్గం వారికి సహకరిస్తూ మాకు అన్యాయం చేస్తున్నారని భాదితుడు శుక్రవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్య క్రమాన్ని చేపట్టారు.చంద్రగిరి వెంకటేష్‌కు చెందిన 639/4, 640/1,3 ,641/4,639/6, సర్వే నెంబర్ లోని తన భూమిలోనే ఒక పక్క రహదారికి భూమి ఇస్తాను అని చెప్పినా వినకుండా భూమి మధ్యలో రహదారి ఇవ్వాలని తహశీల్దారు తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాత్రి సమయాలలో నా భూమిలో కృష్ణయ్య, ఈశ్వరయ్య, రఘురామయ్య, రామచంద్రయ్య కలసి దౌర్జన్యంగా కంచె ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.తహశీల్దారు ఆర్ఐ లక్ష్మిదేవి ని,ఎస్ఐ లక్ష్మిప్రసాద్ రెడ్డి ని,ఎస్ఐ వెంట ఎఎస్ఐ విజయ లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర, సుధాకర్ రాజు లను, విఆర్ఎ లక్ష్మికర్‌లను పంపించి చంద్రగిరి వెంకటేష్ భూమి మధ్యలో దౌర్జన్యం గా పొక్లెయిన్ యంత్రం ద్వారా మరో వర్గం పసుపులేటి కృష్ణయ్య, దేరంగుల ఈశ్వరయ్య, చంద్రగిరి రఘురామయ్య, చంద్రగిరి రామ చంద్రయ్య లకు రహదారి ఏర్పాటుకు తహశీల్దార్ సహకరించి మాకు తీరని అన్యాయం చేస్తుందని బోరున విలపించాడు.30 సంవత్స రాలుగా మామిడి తోటలు సాగుచేస్తున్నాము,కానీ ఏనాడు గొడవలు లేవు,పాత రహదారిని వాడుకుంటున్నామన్నారు.తహశీల్దార్ వచ్చిన తర్వాత గొడవలు మొదలయ్యాయని మహిళలు విమర్శించారు.మాకు న్యాయం జరగక పోతే తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని చంద్రగిరి వెంకటేష్ పేర్కొన్నారు.నా ఆత్మహత్యకు తహశీల్దార్ కారణం అని చంద్రగిరి వెంకటేష్ కుటంబ సభ్యులు పేర్కొన్నారు.జరిగిన అన్యాయం పై రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దృష్టికి తీసుకుపోయామని భాదితులు తెలిపారు.సబ్ కలెక్టర్ సర్వే చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు.జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామన్నారు.

కడప బాలోత్సవం విజేతలకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : "కడప బాలోత్సవం" వారి చే నిర్వహించబడిన 'బాలల వేసవి వినోద శిబిరం ముగింపు' శుక్రవారం మున్సిపల్ హై స్కూల్ (మెయిన్) కడపలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హెచ్.ఎం. నాగమణి మాట్లాడుతూ చిత్రలేఖనము, స్పోకెన్ ఇంగ్లీష్, సంగీతం, ఇంద్రజాల ప్రదర్శన మొదలైన విషయాలపై హైస్కూలు విద్యార్థినీ విద్యార్థులకు మే ఒకటవ తారీఖు నుండి 30వ తారీకు వరకు జరిగిన శిబిరంలో వినోదం, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం ముఖ్యాంశాలుగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా పిల్లలు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకొని విజ్ఞానవంతులై సమాజానికి ఉపయోగపడే భావి భారత పౌరులుగా తయార అవుతారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం. కడప బాలోత్సవం గౌరవ అధ్యక్షులు నాగముని రెడ్డి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు సమాజ అవసరాలతో ముడిపడి ఉందని, రానున్న సాంకేతిక, సాంస్కృతిక అవసరాల రీత్యా విద్యార్థినీ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. జన విజ్ఞాన వేదిక కడప పట్టణ అధ్యక్షుడు ఎన్. శివరాం విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ వేసవి సెలవుల్ని ఉపయోగకరంగా గడిపినందుకు, సెలవుల్లో ఆకతాయిగా తిరిగి ప్రమాదాలకు బారిన పడనందుకు వారిని ప్రశంసించారు. కడప బాలోత్సవం అధ్యక్షులు జి గోపాల్ విద్యార్థిని వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులు చదువులలోనూ, సమాజంలోనూ ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తయారు కావాలని కోరారు. కార్యక్రమంలో టీచర్స్, కృపా వేణ , అరుణ, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైయస్సార్సీపి అధికార ప్రతినిధి శ్యామలకు ఘన స్వాగతం

విశాలాంధ్ర- పులివెందుల : శుక్రవారం పులివెందులకు వైయస్సార్సీపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల రెడ్డికి పులివెందుల వైఎస్ఆర్సిపి మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న, భార్గవిలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె పులివెందులలో నిర్మించిన మెడికల్ కాలేజీ, సర్వజన ఆసుపత్రిని సందర్శించి పరిశీలించారు. శ్యామల మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు వేల కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ మెడికల్ కాలేజీ నిరుపయోగంగా ఉంచడం ఆమె ఆవేదన వెలబుచ్చారు. ఏ ప్రభుత్వం ఉన్నా వేలకోట్లతో నిర్మించిన ఈ భవనాలను నిరుపయోగంగా ఉంచడం మంచి పద్ధతి కాదని తక్షణమే ఇప్పుడున్న కూటమి ప్రభుత్వము మెడికల్ కాలేజీని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో వైస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడి ఇంకా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమలు మరెన్నో ఉన్నాయని వాటన్నిటిని ప్రజలకి తెలియజేయాలని తెలిపారు.ఈకార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పద్మనాభరెడ్డి, దేరంగుల చంద్రమౌళి పులివెందుల నూర్ భాషా సంఘం అధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పని తీరు పై కార్మికుల నిరసన

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట పట్టణంలోని శుక్రవారం మున్సిపల్ కార్మికులు రాజంపేట మున్సిపల్ కమిషనర్ పని తీరుపై నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటీ కమీషనర్ రోజు రోజుకు తీవ్ర ఇబ్బందులకు చేస్తున్నారని తెలిపారు.ఉదయం నిద్ర లేచినప్పటి నుండి రాత్రి వరకు పరుగులు పెట్టిస్తున్న కమిషనర్ పనితీరు పట్ల రాజంపేట పుర ప్రజలు కూడా తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారన్నారు.ఇటువంటి నేపథ్యంలో కమిషనర్ ఒత్తిడికి తట్టుకోలేక శుక్రవారం ఉదయం శానిటరీ కార్యదర్శి హర్షవర్ధన్ ఉద్యోగరీత్యా పని ఒత్తిడి కారణంగా అస్వస్థకు గురి కావడంతో స్పృహ కోల్పోయాడు. ఇది గమనించిన స్థానిక పారిశుద్ధ్య కార్మికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా శానిటరీ కార్యదర్శి హర్షవర్ధన్ భార్య మాట్లాడుతూ నా భర్త పై కమిషనర్ పని ఒత్తిడి పెంచారని ఉదయం, రాత్రి అనక పనులు చేస్తున్నాడని, తినడానికి కూడా సమయం లేకుండా పోతుందని హర్షవర్ధన్ సతీమణి కన్నీటి పర్యంతమయ్యారు.తన భర్త పని ఒత్తిడితో ఆసుపత్రి పాలయ్యాడని, అతని ప్రాణానికి ఏమైనా అయింటే మా పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు. క్రింది స్థాయి నుండే మీరు ఈ స్థాయికి వచ్చారంటు మీడియా ఎదుట మున్సిపల్ కమిషనర్ను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సచివాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కందుల గ్రూప్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2కె 25 ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కెఎస్ఆర్ఎం, కెఎల్ఎం వరుసగా 5వ సంవత్సరం విజయవంతంగా నిర్వహించిన కందుల గ్రూప్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2కె25 ఫలితాలను కందుల గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరీ శుక్రవారం కళాశాల ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 1,2 తేదీలలో నిర్వహించిన పరీక్షలకు 2,223 మంది హాజరు కాగా 1,719 అర్హత సాధించారని తెలిపారు. కందుల శివానంద రెడ్డీ జ్ఞాపకార్థం సరైన విద్యా అవకాశాలూ లేని గ్రామీణ విద్యార్థులను గుర్తించి, విద్యా, వృత్తి ఆశయాలను సాధించే కృషికి ముఖ్య పాత్ర పోషిస్తూ, వారి అభివృధి, సామర్థ్యా అంచనా వేయడం, ప్రతిష్టాత్మక కందుల గ్రూప్ అనుబంధ సంస్థలో ప్రవేశం పొందే అవకాశం, సౌకర్యాలు, స్కాలర్‌షిప్ లు అందించడం మా ముఖ్య ఉద్దేశమని 4 సంవత్సరాలకు గాను 12,000 పై చిలుకు విద్యార్థులు పరీక్షకు హాజరు అయ్యారని పేర్కొన్నారు. వారికి రూ.15 లక్షల విలువైన ఉచిత విద్య, వసతి, రవాణా, ఉచిత స్కాలర్షిప్‌లు అందించామని చెప్పారు. మా కేజీ సెట్ ద్వారా ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి మెరిట్ స్కాలర్షిప్ రూపేణ ప్రతి సంవత్సరం 3,500 నుంచి 10,000 వరకూ పొందుతున్నారని తెలిపారు. ఈ ఏ వి సెట్ ద్వారా సాధించిన ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులకు స్కాలర్ షిప్స్ ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీ.ఎస్. ఎస్ మూర్తి, కే.ఎల్.ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం. వి రత్నమ్మ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ విభాగ సీనియర్ ఆఫీసర్ ఆర్. నాగ రాజు, కేజి సెట్ 2కే25 కన్వీనర్ అలగల హరికృష్ణ, డీన్ ఆఫ్ అడ్మిషన్స్ టి. కిషోర్ కుమార్, కేజీసెట్-2కే 25, నిర్వాహక సిబ్బంది, వివిధ విభాగాదిపతులు, టెక్నికల్ స్టాఫ్, అధ్యాపక, అధ్యాపకేతర పాల్గొన్నారు.

చూపరులను ఆకట్టుకుంటున్న జలపాతం



విశాలాంధ్ర- రామాపురం: గువ్వల చెరువు ఘాట్ లోని శివాలయం సమీపంలోరెండవ మలుపు వద్ద గల జలపాతం చూపారులను అకట్టుకుం టుంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల కురిసిన వర్షం గువ్వలచెరువు ఘాట్ పై భాగం లోని వర్షపు నీరు రెండు కొండల మధ్య కిందికి జలపాత రూపంలో దూకుతూ చూపులను ఆకట్టుకుంటుంది.ఇలాంటి దృశ్యాలు ఘాట్ లో జూలై ఆగస్టు అక్టోబర్ నెలల్లో వచ్చే తుఫాను వల్ల కురిసే వర్షానికి దర్శనమిచ్చేది. ఏడాది మీ మాసంలోనే దర్శనం ఇవ్వడంతో ప్రజలు కడప. రాయచోటి .బెంగళూరు .చిత్తూరు. వెళ్లే ప్రయాణికుల చూపులు ఆకర్షిస్తున్నది. స్థానికులు మే మాసంలో పశువులకు. గొర్రెలు.మేకలకు. నీటి కోసం ఇబ్బందులు పడుతూ ఉండేవారని ఈ ఏడాది మే నెల లోనే వర్షాలు కురిసి పశువులకు నీటి సమస్య లేకుండా సకాలంలో పంటలు సాగు చేసుకోవడానికి ప్రకృతి సహరిస్తుందన్నారు.

ి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్‌లో గుర్తింపు

విశాలాంధ్ర-రాయచోటి:రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఎఏసి) నుండి బిం గ్రేడ్ గుర్తింపు పొందిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.సుధాకర్ రెడ్డి ప్రకటించారు. ఎన్ఎఏసి బృందం కళాశాల యొక్క విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల నైపుణ్యం, పరిశోధన, విద్యార్థుల పురోగతి వంటి అంశాలను సమీక్షించి ఈ గ్రేడ్‌ను మంజూరు చేసింది. ఈ గుర్తింపు కళాశాల యొక్క నాణ్యమైన విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తుంది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ గుర్తింపు మా అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది కృషి, శ్రమతోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత ప్రమాణాలను సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ విజయంతో కళాశాల విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి.

టీటీడీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుని సన్మానించిన మాజీ ఆర్టిసి చైర్మన్

విశాలాంధ్ర - నందలూరు : తిరుమల తిరుపతి దేవస్థానం స్టాండింగ్ కౌన్సిల్ సభ్యునిగా జీవిస్ మూర్తిని ప్రభుత్వం నియమించింది. జీవిస్ మూర్తి జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేశారు. అలాగే మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా పనిచేశారు. జీవిస్ మూర్తిని సన్మానించిన వారిలో నందలూరు మాజీ ఆర్టీసీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, చక్రాల రామసుబ్బన్న, గంటా వాసుదేవయ్య తదితరులు ఉన్నారు.

రైల్వే ట్రాక్ దాటడం చట్టరీత్యా నేరం: ఆర్‌పిఎఫ్ ఎస్ఐ

విశాలాంధ్ర - నందలూరు : ప్రజలు, ప్రయాణికులు రైల్వే ట్రాక్ దాటడం చట్టరీత్యా నేరమని అట్టి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్ పి ఎఫ్ ఎస్సై త్రివేణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్లో ఆమె ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఇయర్ ఫోన్స్ పెట్టుకొని సెల్ఫోన్ మాట్లాడుతూ, కొంతమంది సెల్ఫీల మోజులో పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. పశువులు, గొర్రెల యజమానులు ట్రాక్ వెంబడి మేపడం, దాటడం చేయకూడదని అన్నారు. అలా చేయడంవల్ల ప్రాణం నష్టం, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని అన్నారు. అట్టి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పిఎఫ్ ఏఎస్ఐ రాధాకృష్ణ, ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.

అవినాష్‌రెడ్డి వ్యాఖ్యలకు బిటెక్ రవి స్ట్రాంగ్ కౌంటర్

పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయం చేసేది వాళ్లే..

విశాలాంధ్ర-పులివెందుల: పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయం చేసేది వైసిపి వాళ్లేనంటూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పులివెందుల పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో రెండు విగ్రహాలకు అనుమతి మాత్రమే ఉందని తెలిపారు. పట్టణ పరిధిలో ఎక్కడ చూసినా ఎలాంటి అనుమతులు లేకుండా మొత్తం 12 విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. మహానాడు సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహాన్ని అవమానపరిచేలా తాము జెండాలు ఏర్పాటు చేయలేదన్నారు. జెండాలను తోరణాలను కూడా మహానాడు పూర్తవ్వగానే తొలగిస్తామని చెప్పామన్నారు. తమ మాట పెడచెవిన పెట్టిన కొందరు వైసీపీ నాయకులు టిడిపి జెండాలను, తోరణాలను చింపేసి తొక్కిపడేసి నానా రాద్ధాంతం చేశారన్నారు. ఒకవేళ వారికి అభ్యంతరం ఉంటే మున్సిపల్ అధికారులకు తెలియజేయాలని, అలా తెలియజేయకుండా దౌర్జన్యం చేయడం ఎంతవరకు సబబుని బీటెక్ రవి ప్రశ్నించారు. పోలీసులను అడ్డ పెట్టుకుని కొంతమంది వైసీపీ నాయకులు దిగజారు రాజకీయాలకు పాల్పడుతూ తమపై నింద వేయడం అన్యాయం అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి వైయస్ విజయమ్మ పై కేసు పెట్టింది ఎవరు..? ఆగే సోదరి షర్మిలమ్మకు ఆస్తి పంచి ఇవ్వకుండా ఇంటి నుంచి గెంటేసింది ఎవరు.. వైయస్ రాజశేఖర్ రెడ్డి రాముడైతే ఆయన తమ్ముడు లక్ష్మణుడు వైయస్ వివేకానంద రెడ్డిని గొడ్డలితో అతి కిరాతకంగా హత్య చేసింది ఎవరు..? ఇవన్నీ ప్రశ్నిస్తే ఎవరు చేయించారు అన్నది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అన్నారు. వైయస్సార్ మీద ఉంటే వీటిపై వైసీపీ నాయకులు ప్రశ్నించాలన్నారు. దుందుడుగ రాజకీయాలకు పాల్పడుతున్న వైసిపి నాయకులకు కంటే వైయస్సార్ పై మాకే ఎక్కువ అభిమానం ఉందన్నారు. కావున ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా జెండాలను, తోరణాలను తొక్కి పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి తరఫున డిమాండ్ చేస్తున్నట్లు బీటెక్ రవి వెల్లడించారు.

మహానాడు విజయవంతం

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కడపలో జరిగిన మహానాడు విజయవంతం అయిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెహ్రూ రోడ్డు లోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వరద రాజులరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత కడపలో మహానాడు నిర్వహించడంతో సమైక్య రాష్ట్రంలో కూడా ఎన్నడూ జరగని విధంగా మహానాడు దిగ్విజయంగా జరిగిందన్నారు. మహానాడులో గురువారం చివరి రోజు 5 లక్షల మంది పాల్గొనడం జరిగిందన్నారు. కడపలో మహానాడు జరగడం మన జిల్లా వాసులకు ఎంతో గౌరవం అన్నారు. అన్ని నియోజకవర్గాల నుండి ప్రజలు మహానాడుకు తరలి వచ్చారని అన్నారు. మహానాడుకు వచ్చిన వారికి మూడు రోజులు మంచి భోజనం అందించారన్నారు. మహానాడు సక్సెస్ కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డిని అభినందించారని అన్నారు. బస్సులు, కార్ లలో ప్రొద్దుటూరు నుండి భారీ ఎత్తున తరలి వెళ్లాం అన్నారు. మహానాడులో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ ధనిరెడ్డి రామచంద్రా రెడ్డి, వైస్ ఛైర్మన్ గురివి రెడ్డి, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాల ద్వారా ప్రయోజనం :కమిషనర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : యోగాసనాల అభ్యసనం ద్వారా ఒనగూరే ప్రయోజనాలను గుర్తించి జూన్ 1న కడప నగరం రిమ్స్ వద్దగల వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని యోగా ప్రాధాన్యతను తెలుసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. కడప నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో గల తన చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోజు విశాఖపట్నంలో రాష్ట్రానికి సంబంధించి పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలో నెల రోజుల ముందుగా అంటే మే 11 నుంచి యోగాంధ్ర పేరుతో జిల్లా అంతటా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. యోగా ప్రాధాన్యతను నగర ప్రజలకు తెలిసేలా జూన్1న ఉదయం 5.30 గంటలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమ నిర్వహణకు రూపకల్పన చేశామన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని యోగాసనాలు చేయడం తమ దిన చర్యగా మార్చుకోవాలని, మెరుగైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు.

వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమంలో మంత్రి

విశాలాంధ్ర-రాయచోటి: రాష్ట్రవ్యాప్తంగా నెల రోజులుగా కొనసాగిన వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమం ముగింపు వేడుక శుక్రవారం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శిక్షణలో పాల్గొని వ్యాయామ ఉపాధ్యాయులకు చెక్కులు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారుల అభివృద్ధికి అన్నివిధాలా తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలోనూ రాణించి, రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలన్నారు. రాయచోటి ప్రాంతానికి క్రీడల పట్ల ఉన్న గుర్తింపును మరింతగా అభివృద్ధి చేసి, ఈ ప్రాంతాన్ని క్రీడా హబ్ గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్, శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం.సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. వి. బాలాజీ, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సాగులో శాస్త్రీయత పెంపొందించుకోవాలి

భారత నూనె గింజల పరిశోధనా శాస్త్రవేత్త ఖురేషి

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

విశాలాంధ్ర - నందలూరు : రైతులు సాగులో శాస్త్రీయత పెంపొందించుకోవాలని తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని భారత నూనె గింజల పరిశోధనా శాస్త్రవేత్త ఖురేషి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని లేబాక, నల్ల తిమ్మయ్య గారి పల్లి గ్రామాల నందు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మామిడి తోటల పెంపకం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి కూలంకుశంగా వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామకృష్ణరాజు మాట్లాడుతూ మండలంలోని ప్రధాన పంట వరి పైరు గురించి వివిధ రకాల విత్తనాలు నారుమడి పెంపకం, ప్రధాన పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి సురేష్ బాబు, వైపి గిరీష్ కుమార్, పామాయిల్ పంట అభివృద్ధి అధికారి కొండారెడ్డి, రైతులు పాల్గొన్నారు.